క్లుప్తంగా

స్యూయింగ్ మెషీన్ ఆపరేటర్ శిక్షణకు ఆహ్వానం

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్‌లూమ్స్ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా స్యూయింగ్ మెషీన్ ఆపరేటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ ఖాదీబోర్డు, అపెరల్ పార్క్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్.వి.పద్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు 35ఏళ్ల లోపు మహిళలు మాత్రమే అర్హులని, 7వ తరగతి ఆ పైన చదివి ఉండాలని తెలియజేశారు. 45 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నటుల్ తెలిపారు. వివరాలకు ఎంఎస్, వైజాగ్ అపెరల్ పార్క్ ఫర్ ఎక్స్‌పోర్ట్, వడ్లపూడిలో నేరుగా లేదా 97034 24768, 92930 57305కు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ పింఛన్లు



లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న అప్పారావు, సత్యవతి

అగనంపూడి: అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందించారని దువ్వాడ రైల్వే కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు సత్యవతి తెలిపారు. 85వ వార్డు పెదమడక వార్డు సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో గెద్దాడ రత్నం, అప్పలరాజు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన

పెదగంట్యాడ: కాలువ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ సిబ్బందికి సూచించారు. వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

విజ్ఞాన్‌లో డెకథ్లాన్ క్రీడా పోటీలు



టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న విద్యార్థులు

అగనంపూడి: డెకథ్లాన్ స్పోర్ట్స్ ఇండియా సహకారంతో ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ క్లబ్ ఆధ్వర్యంలో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. హ్యాంగింగ్ ఛాలెంజ్, టగ్ ఆఫ్ వార్, ఆర్చరీ, గోల్ఫ్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెన్నేటి జయంతి



తెన్నేటి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

ఉక్కునగరం: ఉక్కు ఉద్యమ నేత, పార్లమెంట్ మాజీ సభ్యుడు తెన్నేటి విశ్వనాథం 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉక్కునగరం తెన్నేటి పార్కులోని విగ్రహానికి టౌన్ అడ్మిన్ డీజీఎం వి.ఎస్. ఉదయభాస్కర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణానికి తెన్నేటి విశ్వనాథం చేసిన కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో విభాగం సీనియర్ మేనేజర్ కుమార్, వివిధ కార్మిక సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, వి.నారాయణరావు, పి.శ్రీనివాస్, బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది మన గురజాడ

జయంతి వేళ వక్తల నివాళులు

గాజువాక: దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటిన మానవతావాది గురజాడ అప్పారావు అని ఎంవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ అన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన గురజాడ అప్పారావు 161వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అని పేర్కొన్నారు. కళాశాల తెలుగు విభాగాధిపతి గౌరీ శంకర్ మాట్లాడుతూ గురజాడ వంటి మహానుభావుల రచనలను చదవడం ద్వారా విద్యార్థులు భాషా పటుత్వాన్ని సాధించవచ్చన్నారు. కళాశాల సహాయ ప్రిన్సిపాల్ రామ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై.ఈశ్వరరాజు పాల్గొన్నారు.

పెదగంట్యాడ గ్రంథాలయంలో..

పెదగంట్యాడ: నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయం అధికారి పి.వి.రమణ అన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.



పెదగంట్యాడ లైబ్రరీలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమణ, పాఠకులు

అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో..

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురజాడ అప్పారావు 162వ జయంతిని నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి వేదిక జిల్లా అధ్యక్షుడు పరశురాం, ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ రచనల గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు కన్యాశుల్కం నాటికలో పాత్రల గురించి తెలియజేశారు. గురజాడ రచించిన దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ గేయాన్ని ఉపాధ్యాయిని కృష్ణవేణి ఆలపించారు. ఉపాధ్యాయుడు కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంఘసంస్కర్త గురజాడ

ఉక్కునగరం: స్థానిక విశాఖ విమల విద్యాలయంలో మహాకవి గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, ఐద్వా, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కె.వేణు మాట్లాడుతూ గురజాడ గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని సిస్టర్ లాన్సీ, చిల్డ్రన్ క్లబ్ జిల్లా కన్వీనర్ కె.సుశీల, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గౌరీనందనుడికి దీపాంజలి



నడుపూరులో గణపతి మండపం వద్ద దీపారాధనలో భక్తులు



అక్కిరెడ్డిపాలెంలో దీపారాధన

పెదగంట్యాడ: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథునికి దీపారాధన చేశారు. 76వ వార్డు నడుపూరులో క్రేజీ కింగ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా మహిళలు ఓం, శివ లింగాకృతుల్లో రంగవల్లులను తీర్చిదిద్ది, దీపాలు వెలిగించారు.

అక్కిరెడ్డిపాలెంలో ..

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి సంగ్రాన నూకరాజు ఆధ్వర్యంలో దీపారాధన నిర్వహించారు. మహిళలు 6001 ప్రమిదలతో స్వస్తిక్, ఓం, పద్మం ఆకృతుల్లో దీపాలను వెలిగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషన్లోని 33/11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనులు చేపట్టనున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె. నాయుడు తెలిపారు. కూర్మన్నపాలెం ఏరియా, కృష్ణనగర్, శాతవాహననగర్, అశోక్‌నగర్, భరత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఎస్జీఎఫ్ పోటీలు

అగనంపూడి: పెందుర్తి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలు, ఎంపికలు శుక్రవారం ఉదయం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు నియోజకవర్గం కో–ఆర్డినేటర్ లక్ష్మీరాణి, పరవాడ మండల కో–ఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. అండర్ 14, 17 (బాలురు, బాలికల) విభాగాల్లో పోటీలు, ఎంపికలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

పెదగంట్యాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉత్సాహంగా జరిగాయి. అండర్–14, అండర్–17 బాల బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, షటిల్, యోగా, అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ పోటీలను 75వ కార్పొరేటర్ పులి లక్ష్మీబాయ్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రావణి, షేక్ షమీమున్నీసా, ప్రశాంత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ

అక్కిరెడ్డిపాలెం: ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు సత్తా చాటారు. అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి అండర్–14, 17 బాలికల ఖోఖో జట్లు.. ఫైనల్లో పెదగంట్యాడ హైస్కూల్ బాలికల జట్లపై విజయం సాధించాయని పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. వీరితో పాటు తమ పాఠశాల నుంచి అండర్ -17 షటిల్ బ్యాడ్మింటన్‌లో సీహెచ్.మాధురి, అండర్–14 విభాగంలో 600 మీటర్ల ఈవెంట్‌లో ఆర్.ఢిల్లేశ్వరి, చంద్రకళ ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. విజేతలను ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు కుమారస్వామి, గిరిబాబు అభినందించారు.



పరుగు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ఓబీసీ రిజర్వేషన్ ధర్నాలో భీమేష్



అక్కిరెడ్డిపాలెం: చట్టసభల్లో వెనుకబడిన కులాలకు చెందిన ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఓబీసీ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ధర్నాలో 69వ వార్డు షీలానగర్‌కు చెందిన బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పంచుమర్తి లక్ష్మీ భీమేష్ పాల్గొన్నారు.

సంస్థ విజయంలో ఉద్యోగులు కీలకం

- స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) మొహంతి
- స్టీల్‌ప్లాంట్‌లో క్వాలిటీ సర్కిల్స్ చాప్టర్ కన్వెన్షన్ ప్రారంభం

ఉక్కునగరం: సంస్థల విజయం అందులో ఉద్యోగులపై ఆధారపడి ఉంటుందని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో క్వాలిటీ సర్కిల్స్ చాప్టర్ కన్వెన్షన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉక్కు మల్టీపర్పస్ హాలులో ఏర్పాటు చేసిన కన్వెన్షన్‌లో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో క్వాలిటీ సర్కిల్స్, ఫైవ్ ఎస్, సిక్స్ సిగ్మా కాన్సెప్టులు అధిక ప్రాధాన్యం కలిగి ఉన్నాయన్నారు. షిప్‌యార్డ్ డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ కమర్షియల్) ఎస్.వి. రాంబాబు మాట్లాడుతూ ఉత్పాదకత, నాణ్యత, వ్యయం, భద్రత, వినియోగదారుల సంతృప్తి, జట్టు కృషిపై ప్రభావం చూపేందుకు క్వాలిటీ సర్కిళ్ల తోడ్పాటు ప్రత్యేక సాధనమన్నారు. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం, చాప్టర్ చైర్మన్ జి.గాంధీ, డాక్టర్ జీఎం కమోడర్ సంజయ్‌కుమార్, చాప్టర్ కార్యదర్శి సాగర్ ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 33 సంస్థల నుంచి 650 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మొహంతి

'ఉక్కు' ప్రైవేటీకరణ దారుణం



శిబిరంలో మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం అత్యంత దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 952వ రోజు సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కార్మికులు తలచుకుంటే ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి కార్మికులకు అండగా నిలబడాలని కోరారు.

ఉద్యోగులకు అద్దె తిరిగి చెల్లించాలి

ఉక్కునగరం: హెచ్‌బీ కాలనీలో నివాసముంటున్న ఉద్యోగులకు రికవరీ చేసిన అద్దెను తిరిగి చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు కోరారు. హెచ్‌బీ కాలనీలోని క్వార్టర్లలో ఉంటున్న ఉద్యోగులను ఖాళీ చేయిస్తున్న పరిస్థితుల్లో కార్మిక సంఘాలతో టౌన్ అడ్మిన్ జీఎం వై. చంద్రశేఖర్ ఆధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్వార్టర్లు ఖాళీ చేయాల్సి వస్తే వారికి హెచ్ఆర్ఏ ఇవ్వడంతో పాటు ఇప్పటికే రికవరీ చేసిన పీనల్ రెంట్‌ను తిరిగి చెల్లించాలన్నారు. నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, బీఎంకె నాయక్,మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం

ఉక్కునగరం: వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన ఓబీసీ ఉద్యోగులు, వారి కుటుంబీకులను స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సత్కరించింది. స్టీల్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన ఉద్యోగులు, వారి కుటుంబీకులను సత్కరించారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎంలు జి.గాంధీ, డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, జీఎంలు ఎం.మధుసూదనరావు, వై.చంద్రశేఖర్, లైజన్ ఆఫీసర్ జి.అప్పారావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, రామస్వామి, కారు రమణ, వై.మస్తానప్ప, ఓబీసీ సంఘం నాయకులు బి.అప్పారావు, ఎం.శ్రీనివాసరావు, కోయిలాడ శ్రీనివాసరావు, వై.ఎల్. నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్ తదితరులు

ఏరియా ఆస్పత్రిలో వ్యాధి నియంత్రణ చర్యలు భేష్

ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ ప్రశంసలు

అగనంపూడి: అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో అంటురోగాలు ప్రబలకుండా వైద్యులు తీసుకుంటున్న చర్యలు భేషుగ్గా ఉన్నాయని ఇన్ఫెక్షన్ కంట్రోల్ కమిటీ ప్రతినిధుల బృందం ప్రశంసించింది. ఏరియా ఆస్పత్రిని బృందం గురువారం సందర్శించింది.ప్రసూతి వార్డు, చిన్న పిల్లల వార్డు, ఆపరేషన్ థియేటర్, బాలింతల వార్డు, క్యాజువాల్టీ, ఆస్పత్రి పరిసరాలను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంటురోగాలు ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది తీసుకుంటున్న చర్యలను మెచ్చుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి, ఇతర వైద్యులతో సమావేశమై సూచనలు చేశారు. బృంద ప్రతినిధి డాక్టర్ సతీష్, నీరజ తదితరులు పాల్గొన్నారు.



చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న కమిటీ ప్రతినిధులు

యాదవ భవనానికి స్థలం కేటాయింపుపై హర్షం



సుబ్బారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

గాజువాక: విశాఖ జిల్లా యాదవ సంఘ భవనానికి ఎండాడలోని దిశ పోలీస్ స్టేషన్ పక్కన అరెకరం స్థలం కేటాయిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో పాటు కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం చేయడంపై గాజువాక ప్రాంత యాదవ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉరుకూటి అప్పారావు ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని గురువారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను గజమాలతో సత్కరించారు. యాదవులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన ముఖ్యమంత్రి ఇప్పుడు యాదవ భవనానికి స్థలం కూడా కేటాయించారని, ఈ జిల్లా యాదవులు ఆయనకు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు, బీహెచ్ఈఎల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఉరుకూటి బాబూరావు, యాదవ ఉద్యోగుల సంఘం నాయకులు అధ్యక్షుడు ఉరుకూటి రాజారావు, నాయకులు చట్టి అప్పలరాజు, పెద అప్పారావు, మాడిస రాము, గొలగాని కనకరాజు, నీలాతి అచ్చిబాబు, అప్పలనాయుడు, పల్లా చిన్న తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల విజేతలకు సత్కారం



క్రీడాకారులను సత్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: ఇటీవల శ్రీలంకలో నిర్వహించిన అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొని, ద్వితీయ స్థానం సాధించిన గాజువాక ప్రాంత క్రీడాకారులను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఘనంగా సత్కరించారు. స్థానిక పాతకర్ణవానిపాలెంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొన్న వందమంది క్రీడాకారుల్లో ఏడుగురు గాజువాక ప్రాంతానికి చెందినవారు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెట్స్ సంఘం ప్రధాన కార్యదర్శి మంగా వరప్రసాద్, ప్రతినిధులు ఎం.రామారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిక్స్ సదస్సుకు స్టీల్ ఏఐటీయూసీ నాయకుడు



రామకృష్ణ

ఉక్కునగరం: బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికా (బ్రిక్స్) ట్రేడ్ యూనియన్ ఫోరం సదస్సుకు స్టీల్‌ప్లాంట్ ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ హాజరవుతున్నారు. ఈ మేరకు ఆయనకు ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి అమర్‌జీత్ కౌర్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 26, 27 తేదీల్లో సౌత్ ఆఫ్రికాలోని దర్బన్ సిటీలో ఈ సమావేశం జరగనుంది. ఈ సదస్సుకు బ్రిక్స్ దేశాలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు హాజరుకానున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎకనమిక్ గ్రోత్, స్కిల్ డెవలప్‌మెంట్, జాబ్ క్రియేషన్స్, కార్మికుల ఆదాయం తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ సదస్సులో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం జరిగే పోరాటం , దేశంలో పీఎస్‌యూలు ప్రైవేటీకరణ జరగకుండా చేయాలన్న విషయాలపై చర్చించనున్నామని రామకృష్ణ తెలిపారు.

డెంగ్యూపై అప్రమత్తత అవసరం

పెదగంట్యాడ: డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. జీవీఎంసీ 64వ వార్డు కొత్తదిబ్బపాలెంలో గురువారం పర్యటించిన ఆయన పర్యటించారు. ఈ ప్రాంతంలో డెంగ్యూ కేసులు నమోదు కావడంతో అప్రమత్తమైన అధికారులు స్థానికులకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మలేరియా సిబ్బంది, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.



నీటి నిల్వలు తనిఖీ చేస్తున్న ఏఎంహెచ్‌వో

సమస్యల పరిష్కారానికి వినతి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సాయినగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డిని కాలనీవాసులు కోరారు. ఇల్లపు ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం దేవన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, మంచినీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని దేవన్‌రెడ్డి తెలిపారు.



దేవన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

అన్న సమారాధన

పెదగంట్యాడ: వినాయక చవితి మహోత్సవాలలో భాగంగా 76వ వార్డు పెదనడుపూరు విశ్వబ్రాహ్మణ వీధిలో విశ్వబ్రాహ్మణ యువజన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, తాటికొండ కాశి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అద్దంకి'కి రామాయణ ప్రవచన కౌముది బిరుదు



అద్దంకిని సత్కరిస్తున్న నిర్వాహకులు

పెదగంట్యాడ: సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రవచన కళాప్రపూర్ణ అద్దంకి రాఘవాచార్యులుకు శ్రీ రామాయణ ప్రవచన కౌముది బిరుదు లభించింది. రామాయణ సారం, సనాతన ధర్మ కాసారం అంశంపై హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో గల శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో ఆయన చేసిన ప్రసంగానికి ప్రశంసలు లభించాయి. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం అధికారులు బిరుదుతో పాటు ప్రశంసాపత్రం, నగదు బహుమతిని అందజేసి సత్కరించారు.

ఏకదంతాయ.. బహు రూపాయ..



గౌరీ నందనుడు విభిన్న రూపాల్లో కొలువుదీరాడు. చినఅక్కిరెడ్డిపాలెంలోని ఓ మండపంలో తండ్రియైన మహాదేవుడి రూపంలో బొజ్జ గణపయ్య ఆకట్టుకుంటుండగా.. వివేకానంద కాలనీలో మూషికవాహనుడు నెమలిని అధిష్ఠించి కనువిందు చేశారు. మండపాల్లో ఉదయం, సాయంత్ర ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల భక్తులు స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. - అక్కిరెడ్డిపాలెం



నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అక్కిరెడ్డిపాలెం: నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని క్రైం డీసీపీ జి.నాగన్న కోరారు. గాజువాకలోని వాసవీ కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక వ్యాపార సముదాయాల నిర్వాహకులకు, ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు. ఇటీవల చోరీలు పెరుగుతున్నందున వ్యాపార సముదాయాల్లో, ఇంటి ముందు భాగాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలతో 90 శాతం నేరాలను అరికట్టవచ్చన్నారు. సెల్ ఫోన్ల అపహరణ, తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సౌత్ ఏసీపీ త్రినాథరావు, క్రైం ఏడీసీపీ డి.గంగాధరం, క్రైం ఏసీపీ సునీల్ కుమార్, గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు, క్రైం సీఐ పి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న క్రైం డీసీపీ నాగన్న